

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


# విధి నిర్వహణలో పోలీసుల పాత్ర గొప్పది

**- అమరులవీరుల దినోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిఖిల , ఎస్పీ కోటిరెడ్డి**



అమర వీరుల దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్,ఎస్పీ,పోలీసులు సిబ్బంది

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి**

ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీస్ మేలుకొని శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటుందని ఎండనక వాననక,పగలు రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండగలకు కూడా దూరంగా ఉంటూ ప్రజల కోసం జీవించి ప్రజల కోసం మరణించే పోలీస్ వారు ప్రాణాలు పణంగా పెట్టి చేసినటువంటి త్యాగానికి సానుభూతిగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరపడం మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ నిఖిల,ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం వికారాబాద్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ నిఖిల హాజరైయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ నిఖిల,ఎస్పీ కోటిరెడ్డి పరేడ్ కమాండర్‌తో గౌరవవందనం తీసుకొని అమరవీరుల పేర్లు కల్గిన పుస్తకాన్ని విడుదల చేశారు.ఎస్పీ మరణించిన వారి పేర్లను చదువుతూ స్మరించికున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ...దేశ రక్షణ కొరకు చివరి రక్తపు బొట్టు వరకు ప్రాణాలకు తెగించి పోరాడుతున్న క్రమంలోనే డిఎస్పీ కరమ్ సింగ్‌తో పాటుగా 10మంది భారత మాత రక్షణలో వీరమరణం పొందినారు.మరికొందరికి గాయాలు అయ్యాయి.అందుకు అక్టోబర్ 21న పోలీస్ సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు.పోలీస్ లేని సమాజాన్ని ఊహించుకోవడం చాలా కష్టం అంతర్గత సంఘ విద్రోహ శక్తులను ఎదుర్కొంటున్న పోలీస్ అమరవీరులకు జోహర్లు అని శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అవసరమైతే ప్రాణత్యాగానికి కూడా వెనకాడరని అమరులైన పోలీసులు మనకు,సమాజానికి నిరంతరం గుర్తు చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తీర్చిద్దడానికి ప్రభుత్వ సహకారంతో సాంకేతికతను వినియోగించి పోలీసు సేవలలో నాణ్యతను పెంచడానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని అన్నారు.అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు.అనంతరం కలెక్టర్ నిఖిల మాట్లాడుతూ...మనకోసం ప్రాణాలు త్యాగం చేసిన ప్రతి ఒక్క పోలీస్ అధికారులను స్మరించి వారి త్యాగ్యాన్ని గుర్తించుకోవాలి పోలీస్ విధి నిర్వహణలో తమ కుటుంబాలను సైతం త్యాగం చేస్తూ మనందరికీ సేవలు చేస్తారని కొనియాడారు.శాంతి భద్రతల కోసం మనం,మన కుటుంబాలు క్షేమంగా ఉండటం కోసం ఎన్నో త్యాగాలు చేస్తున్న పోలిసులందరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరు అయిన పోలీస్ అధికారులు అందరూ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలను ఉంచి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి ఎంఎ రశీద్,డిటిసి అదనపు ఎస్‌పి మురళిధర్,డిఎస్పి సత్యనారాయణ,పరిగి డిఎస్పీ కరుణాకర్ రెడ్డి,తాండూర్ డిఎస్పీ శేఖర్ గౌడ్,జిల్లా ఇన్స్‌పెక్టర్‌లు,ఎస్‌లు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేషనల్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

**-ఉన్నత విద్యను చదువుతున్న గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**

**-జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 21, ప్రభాతవార్త :** 2022-2023 విద్యాసంవత్సరానికి గిరిజన వ్యవహారాల శాఖ,భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగ ఉన్న విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించటం జరుగుతుందని, ఈ నెల 31వ తేదీ వరకు ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని మేడ్చల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పథకంనకు ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాకు చెందిన ఉన్నత విద్య అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులు స్కాలర్‌షిప్ పథకం కోసం సంబంధిత వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.స్కాలర్‌షిప్స్.జిఓవి.ఇన్ నందు ఈ నెల 31వ తేదీలోగా ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో సమాచారం తెలుసుకోవచ్చని అన్నారు. జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి వినోద్‌కుమార్ సూచించారు.

# ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలి

**-రాష్ట్ర మంత్రి సిహెచ్ మల్లారెడ్డి**

**-26వ తేదీ నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభం**

**-పాల్గొన్న జడ్పీచైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్**

**-కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశం**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి,పాల్గొన్న జడ్పీచైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్, తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 21, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ అన్ని ఏర్పాట్లు చేయాలని, చివరి గింజ వరకు కూడ ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదని, ఈ నెల 26వ తేదీ నుంచి జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హరీశ్ అధ్యక్షతన వానాకాలం 2022-2023 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం జరిగింది. దీనిలో జడ్పీచైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి కూడ పాల్గొన్నారు. ఈ సందర్భంగ పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. వరి ధాన్యంను కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో రూపాయలు జమ జరుగుతుందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం పూర్తిగ ఉంటుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగ 11వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 6కేంద్రాలు, పిఎసిఎస్ ఆధ్వర్యంలో 3కేంద్రాలు, ఎఫ్ఎస్‌సిఎస్ ఆధ్వర్యంలో 2కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి వరి ధాన్యంను కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిర్లక్ష్యం చేయకుండ వెనువెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఈ సీజన్‌లో 45,450టన్నులు వరి ధాన్యం కొనుగోలు చేయటానికి నిర్ణయించినట్లు, ఇప్పటి వరకు 30వేల టన్నుల వరి ధాన్యం పంట పండినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారన్నారు. రైతుల నుంచి ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఏ గ్రేడ్ రకానికి 2,060రూపాయలు, మామూలు రకానికి 2,040 రూపాయలు మద్దతు ధర అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు వరిధాన్యంను బయట అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని మంత్రి మల్లారెడ్డి సూచించారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని అన్నారు. అధికారులు అందరు సమన్వయంతో ఉండి రైతులకు ఇబ్బందులు కలుగకుండ చూడాలన్నారు. జడ్పీ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించటానికి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని, కేంద్రాల వద్ద అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వరస క్రమంలో రావటానికి టోకెన్ పద్దతిని ఏర్పాటు చేయాలన్నారు. తూకం వేసిన తరువాతనే సిబ్బంది ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాలన్నారు. కేంద్రాల్లో టార్పాలిన్లు, తూకం వేసే మిషన్లు, ప్యాడీక్లీనర్స్‌ను అందించేలా చూడలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ ఈ సారి వర్షాకాలం సీజన్‌కు సంబంధించి 11కేంద్రాలు ఏర్పాటు చేయటానికి, వసతులు, సౌకర్యాలు అన్ని చర్యలు చేపట్టామన్నారు. రైతులు వ్యవసాయ పొలాల నుంచి వరిధాన్యం తీసుకరావటానికి గోనెసంచులు సరిపడా సంచులు ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. మార్కెటింగ్ అధికారులు, ట్రాన్స్‌పటర్ కాంట్రాక్టర్లు, రైసుమిల్లుల యజమానులు వారు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇబ్బందులు ఏర్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు మధ్య దళారుల వద్దకు వెళ్లకుండ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాల్లోనే రైతులు వరి ధాన్యంను విక్రయించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు నందారెడినడ, డిసిఎంఎస్ వైస చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌మూర్తి, ఫౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, కీసర ఆర్డీఓ రవి, ఫీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, జిల్లాలోని రైసుమిల్లుల యజమానులు, ట్రాన్స్‌పోర్టుకాంట్రాక్టర్లు, రైతుఅనుబంధ సహకార సంఘాల సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, పాల్గొన్నారు.



.జిల్లా సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు, రైసుమిల్లుల యజమానులు,కాంట్రాక్టర్లు, తదితరులు

# దేశ క్షేమం కోసమే రాహుల్ పాదయాత్ర

**- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క**

**- జోడో యాత్రలో భాగంగా షాద్‌నగర్‌లో ఏర్పాట్ల పరిశీలన**

**- సభ స్థలిని పరిశీలించి పలు సూచనలు చేసిన భట్టి విక్రమార్క**

**షాద్‌నగర్, అక్టోబర్ 21, (ప్రభాతవార్త) :**

కాంగ్రెస్ అగ్ర నాయకుడు చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ క్షేమం కోసం చేపట్టిన పాదయాత్ర అని, దేశంపై ప్రేమ, అభిమానం ఉన్న ప్రతి ఒక్కరు ఈ యాత్రలో భాగస్వాములు కావొచ్చు అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ సాహసోపేతమైన భారత్ జోడో పాదయాత్ర చేపట్టారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణ శివారులోని వై జంక్షన్ వద్ద రాహుల్ గాంధీ పర్యటనకు సంబంధించిన సభా స్థలిని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... మతతత్వ శక్తుల చేతుల్లో భారత దేశం విడిపోకూడదని, ఆర్థిక పరమైన వ్యత్యాసాలతో విడిపోయి దేశంలో అరాచకాలు సృష్టించకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో రాహుల్ గాంధీ ఈ యాత్ర చేస్తున్నారని ఆయన కొనియాడారు. రాహుల్ గాంధీ రాక కోసం కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారని, ప్రజలు కూడా ఆయనకు భారీ ఎత్తున ఆహ్వానం పలకాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత కోసం అడుగులు వేస్తున్న రాహుల్ గాంధీ అడుగులో అడిగేసి నడవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర దేశ భవిష్యత్తును నిర్ణయించబోతుందని అని అన్నారు. ఈనెల 30, 31వ తేదిల్లో రాహుల్ గాంధీ యాత్ర షాద్‌నగర్ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అనంతరం సభా స్థలి వద్ద తీసుకోవాల్సిన చర్యల గురించి పార్టీ శ్రేణులకు పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందెమోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, పట్టణ అధ్యఓఉడు కొంకళ్ల చెన్నయ్య, ఫరూక్నగర్ మండల అధ్యక్షుడు ఆశన్నగౌడ్, జితేందర్‌రెడ్డి, రఘు, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క, తదితరులు

# చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలి

**- ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్**

**- అన్నారం, విఠ్యాల గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో పరిశీలన**



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, తదితరులు

**షాద్‌నగర్, అక్టోబర్ 21, (ప్రభాతవార్త) :**

వరి, పత్తి పంటలల్లో వచ్చే చీడపీడల నివారణకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని అన్నారం, విఠ్యాల, కిషన్ నగర్ తదితర గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ... అధిక శాతం వర్షాలు పడుతున్నాయని పంటల్లో చీడపీడల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ముఖ్యంగా వరి పంటలో కాండం తొలిచే పురుగు, ఆకును కత్తిరించే పురుగు వస్తుందని ఆయన తెలిపారు. అదేవిధంగా పత్తి పంటల్లో తెల్లదోమ, తామర పురుగులు వస్తాయని వీటిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు జాగ్రత్తలు తెలిపారు.కార్యక్రమంలో విస్తరణ అధికారులు తేజ్ కుమార్, నిఖిల్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

## తాటికుంట మైసమ్మ ఆలయంలో దేవతా విగ్రహం చోరీ



విగ్రహం చోరీకి గురైన తాటికుంట మైసమ్మ ఆలయం

**యాచారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

మండల పరిధిలోని తాటిపర్తి గ్రామంలో కొలువైన తాటికుంట మైసమ్మ ఆలయంలో దేవతా విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని తాటికుంట మైసమ్మ ఆలయంలో గత కొన్ని రోజులుగా నిత్య పూజా కార్యక్రమాలు నిలిపివేయబడ్డాన్నారు. ఆలయ పరిసరాలు, నీటి కుంటలన్నీ నీటిమయం కావడంతో రాకపోకలకు ఇబ్బంది అవుతుండడంతో ఆలయాన్ని మూసివేశారు. ఇదే అదునుగా భావించిన దుండగులు అమ్మవారి విగ్రహాన్ని మాయం చేసినట్లు స్థానికులు భావిస్తున్నారు. సర్పంచ్ దూసర రమేష్, ఎంపిటిసి బాబు రోజులు పోలీసులకు ఈ విషయమై ఫిర్యాధు చేశారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు అందించాలి : ఎస్ఈ

**బొంరాస్‌పేట్,అక్టోబర్ 21ప్రభాతవార్త :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరైన సమయంలో త్రాగునీరు అందించాలని మిషన్ భగీరథ ఎస్ఈ అంజనేయులు అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని బురాన్‌పూర్,రేగడిమైలారం తదితర గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరా స్థితిగతులను తనిఖీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజల అవసరాలను బట్టి త్రాగునీరు అందించాలని సూచించారు.ఇంటింటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం అమలు చేస్తున్నదని,అందుకు తగినట్టుగానే ఇంటింటికి సరక్షిత నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.అంతేగాక ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ పద్మలత,డిప్యూటీ ఈఈ శశాంక్,రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చందన్‌వెల్లి భూనిర్వాసితుల దీక్ష శిబిరానికి నిప్పుపెట్టిన గుర్తుతెలియని దుండగులు



హైతాబాద్‌లో ఆందోళన చేస్తున్న చందన్‌వెల్లి భూనిర్వాసితులు

**షాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :**

దీక్షా శిబిరాన్ని దగ్ధం చేసిన నింధితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని చందన్‌వెల్లి భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. భూపరిహారం చెల్లించాలని గత 83రోజులుగా చందన్‌వెల్లి భూనిర్వాసితులు హైతాబాద్ చౌరస్తాలో శిబిరం ఏర్పాటు చేసుకుని దీక్ష చేస్తున్న శిబిరాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి దగ్ధం చేశారు. దీనిపై ఆగ్రహించిన భూనిర్వాసితులు హైతాబాద్ చౌరస్తాలో రోడ్డుపై కూర్చొని రాస్తారోకో, ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....గత 83రోజులుగా హైతాబాద్ చౌరస్తాలో శాంతియుతంగా రిలే నిరహార దీక్షలు చేస్తున్నామని, మా శిబిరాన్ని అక్రమార్కులు తగులబెట్టారని వారు మండిపడ్డారు. రెండు రోజుల ముందే ఇక్కడి సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసి ఈ దురాగతానికి ఒడిగట్టారన్నారు. దీక్ష ఈ శిబిరాన్ని తగులబెట్టిన దుండగులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో చందన్‌వెల్లి భూనిర్వాసితులు తదితరులు ఉన్నారు.

## పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, జిల్లా జడ్పీవైస్ చైర్మెన్ ఈట గణేష్ తెలిపారు. కొత్తూర్ పురపాలక పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో వైస్ చైర్మెన్ డోలీ రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తడిపొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... .వానకాలంలో చెత్త నిల్వలు పెరిగిపోవడం వల్ల రోగాలు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, పరిశుభ్రతకు ప్రాముఖ్యతనివ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎండీ మిస్కిన్, డోలీ రవీందర్, రమేష్, సత్యనారాయణ, నరసింహ్మారెడ్డి, రాఘవేందర్, వడ్డే రమేష్, రాజు, నారాయణ తదితరులు ఉన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

# పోడు భూముల సర్వే పురోగతిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ నిఖిల

**వికారాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:**

పోడు భూములకు పట్టాలు జారీకై క్షేత్ర స్థాయిలో ఆర్వోఎఫ్ఆర్ మొబైల్ యాప్ ద్వారా నిర్వహించిన పోడు భూముల సర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ నిఖిల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఫారెస్ట్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని తన చాంబర్ నుండి జిల్లా కలెక్టర్ నిఖిల పోడు క్లెయిమ్‌ల పరిశీలన పురోగతిని సంభందిత అధికారులతో మండలాల వారీగా సమీక్షిస్తూ, జిల్లాలోని 19 మండలాల్లోని సంబంధిత గ్రామాలకు సర్వే బృందాలు వెళ్లి పోడు భూముల దరఖాస్తులు క్షేత్రస్థాయిలో ఆర్వోఎఫ్ఆర్ మొబైల్ యాప్ ద్వారా నవంబర్ 10 వరకు పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని మొత్తం 19 మండలాలలో 9755 దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటి వరకు 30 శాతం ప ు లు మాత్రమే పూర్తి చేయడం జరిగిందని మిగతా పనులన్నింటినీ వేగవంతం చేసి నవంబర్ 10 వరకు పూర్తి చేయాలని అన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో ప ు లు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు మండలం వారిగా 25 దరఖాస్తులు పరిష్కరించాలని అన్నారు. పూర్తి చేసిన పనులు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. జిల్లా ఫారెస్ట్ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పనులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని తెలిపారు. పరిష్కారం కోసం గ్రామ కమిటీల ద్వారా సమావేశాలు నిర్వహించి పని పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు పూర్తి చేసిన పనులు ఆన్లైన్ ద్వారా పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఇట్టి పనులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాల పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. మండలాల వారీ గా తహసిల్దార్లు అందరూ క్రీడా ప్రాంగణాల స్థలాలు గ్రౌండ్ చేసి ఎంపీడీఓలకు అందజేయాలన్నారు. ఇట్టి వివరాలు తనకు వెంటనే అంద జేయాలని ఆదేశించారు. ఓటర్ ఐడీ కార్డుకు ఆధార్ అనుసంధానం పనులు బిఎల్‌వోల ద్వారా వెంటనే పూర్తి చేయాలన్నారు. బిఎల్ఓ లతో సమా వేశాలు నిర్వహించుకొని 15 రోజులలో ఇట్టి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తాసిల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, కలెక్టర్ కార్యాలయ తహసీల్దార్ హరిత, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఫారెస్ట్ అధికారులు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



టెలికాన్ఫరెన్సు ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ నిఖిల

# భూమిని ఆలయానికి వదిలివేయాలని గ్రామస్తులు ఆందోళన

**-తహసీల్దార్‌కు మెమోరాండం అందజేసిన గ్రామస్థులు**



తహసీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**శంషాబాద్ అక్టోబర్21,ప్రభాతవార్త :**

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్వాల్ గూడ సర్వేనెంబర్ 128లో ఉన్న భూమిని అమ్మవారి దేవాలయానికి వదిలివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు.ఆలయ పరిసరాల్లో ఉన్న భూమిని ఖరీదు చేసిన వ్యక్తి భూమిని చదును చేస్తున్నడంతో స్థానికులు అడ్డుకున్నారు.గ్రామ మాజీ సర్పంచ్ పగడాల శ్రీనివాస్ గౌడ్ గ్రామ ప్రముఖులు రాజేష్ యాదవ్,జగదీశ్వర్ యాదవ్,కృష్ణ యాదవ్,పూర్ణ ముదిరాజ్,శేఖర్ రెడ్డి,అశోక్ ముదిరాజ్,శివ యాదవ్,మహేష్ యాదవ్ తదితరులు శంషాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి,శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కలిసి ఫిర్యాదు చేశారు.అనేక సంవత్సరాలుగా ఇక్కడ దేవాలయం ఉన్నదని ఆ దేవాలయం చుట్టుపక్కల ఉన్న స్థలాన్ని ఆలయానికి వదిలివేయాలని వారు డిమాండ్ చేశారు.భూమిని ఖరీదు చేసిన వ్యక్తికి గ్రామస్తులందరూ చందాలు వేసుకొని డబ్బులను తిరిగి చెల్లిస్తామని వారు తెలిపారు.

### తహసీల్దార్ వివరణ

ఈ విషయమై శంషాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... 128 సర్వే నంబర్ పట్టా భూమి అని అందులో 11 ఎకరాల పైచిలుకు భూమి ఉంటుందని తెలిపారు.ప్రైవేట్ భూమి అయినప్పటికి అందులో దేవాలయం ఉన్న ప్రదేశంలో కొంత భాగాన్ని దేవాలయానికి వదిలివేయాలని పట్టాదారుకు సూచిస్తున్నట్లు వివరించారు.ఆలయానికి నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## జాతీయ స్థాయిలో మెరిసిన గ్రామీణ ఆణిముత్యాలు


మెడల్స్ సాధించిన శ్రీ సింధు, శ్రీ బి ందులు

యాచారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త
ఈ నెల 20న ఢిల్లీలో జరిగినటువంటి అండర్ – 14 రోప్ స్కిప్పింగ్ ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి పంచాయితీ పరిధిలోని మీసాలు తండాకు చెందిన నేనావత్ జ్యోతి జైపాల్‌నాయక్ ఇద్దరు కుమార్తెలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటుకుని గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించడంతో తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబం నుండి వచ్చి గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవడంతో వారి తల్లిదండ్రులతో పాటు బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా వీరు హైదరాబాద్‌లో జరిగినటువంటి ఆదర్శ కళానిలయం వారిచే ఆదర్శ నటరాజ్ అవార్డులు పొందిన విషయం తెలిసిందే.

## దేశం ఐక్యతే రాహుల్‌గాంధీ పాదయాత్ర లక్ష్యం

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్**

షాద్‌నగర్, అక్టోబర్ 21, (ప్రభాతవార్త) :
దేశంలోని సర్వ మతాలు ఐక్యమత్యంగా కలిసి మెలిసి ఉండటం కోసమే కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని, ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములై దేశ ఐక్యతను చాటి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఈమేరకు ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర ఈనెల 30, 31వ తేదీల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రవేశిస్తుందని, ఈ పాదయాత్రకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఎంతగానో ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కంచుకోట అయిన షాద్‌నగర్ నియోజకవర్గం మళ్లీ పార్టీ పూర్వ వైభవం సంతరించుకోవడానికి సిద్ధమవుతుందని ఆయన పేర్కొన్నారు. షాద్‌నగర్ వై జంక్షన్ వద్ద భారీ సభను నిర్వహిస్తున్నామని ఈ సభకు ప్రతి ఒక్కరు తరలి రావాలని ఆయన కోరారు. అంతర్గతంగా ఉన్న సమస్యలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధి కోసం కలిసి మెలిసి ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.

## ఇంటింటికి ప్రచారం చేయాలి


భారత్ జోడో యాత్ర గోడ పత్రికను అతిస్తున్న నాయకులు

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 21,(ప్రభాతవార్త):
కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను ఇంటింటికి ప్రచారం చేయాలని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో భారత్ జోడో యాత్ర గోడ పత్రికలు వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన సూచించారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి శ్రీను, నాయకులు హసన్, సిద్దయ్య, జంగయ్య, లక్ష్మయ్య, సలీం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ పీఎస్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం


ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులతో సీఐ అశోక్‌రెడ్డి, సిబ్బంది

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎదులాబాద్ రోడ్డులోని శ్రీచంద్ర స్కూల్ విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌లో పలు విభాగాలను సందర్శించారు. ఎస్‌హెచ్‌ఓ చాంబర్, ఎస్ఐల క్యాబిన్‌లు, ఫిర్యాదుల స్వీకరణ, కుటుంబ కౌన్సిలింగ్, సంస్కరణల గది, ఈ–కాప్స్ కంప్యూటర్ విభాగం, ఆయుధాలు, స్టేషన్‌లో వివిధ నేరాలకు సంబంధించిన ఫైళ్లలను పరిశీలించారు. పీఎస్ నిర్వహణ, కేసుల నమోదు, పోలీసుల విధులు, పనితీరుపై సీఐ, ఎస్ఐలు విద్యార్థులకు వివరించారు. పోలీసు అమర వీరుల దినం సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ‘తొలిమెట్టు’ను విజయవంతం చేయాలి

**రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డ్ డైరెక్టర్ కృష్ణారావు, జిల్లా విద్యాధికారి రమేష్**


విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న కృష్ణారావు

కొల్చారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:
ఎఫ్ఎల్ఎన్(తొలిమెట్టు) మానిటరింగ్‌లో భాగంగా రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డ్ డైరెక్టర్ కృష్ణారావు, జిల్లా విద్యాధికారి రమేష్, సెక్టోరియల్ ఆఫీసర్ సుభాష్, మండల విద్యాధికారి నీలకంఠం కొల్చారం మండలంలోని కేజీబీవీ, అప్పాజిపల్లి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన తీరును, విద్యార్థుల ప్రతిస్పందనను పర్యవేక్షించారు. సూచనలు సలహాలు అందించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికై ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వారి బోధన పద్ధతులలో మెళకువలను పాటించి సరైన పాఠ్యప్రణాళికలతో, బోధనాభ్యాసన సామాగ్రితో విద్యార్థులకు అర్థమయ్యేతీరులో బోధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంచటానికి తొలిమెట్టు లక్ష్యాన్ని సాధించే విధంగా వారు కృషి చేయాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రమేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనా పద్ధతుల్లో మెళకువలు పాటించాలన్నారు. టైంటేబుల్ నిర్వహణ, టీఎల్ఎం, పుస్తకాల వినియోగం, లెస్సన్ ప్లాన్స్ తయారు చేసుకోవడం, లైబ్రరీ నిర్వహణ తొలిమెట్టు కార్యక్రమంలో ప్రతి అంశాన్ని, లక్ష్యాన్ని సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. అలాగే కొల్చారం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు సతీష్, రాజు, అనురాధ, అరుణ, ఐఈఆర్‌పీ కనకరాజు, ఎంఐఎస్ సంపత్, సీఆర్‌పీలు సాయికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**-ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజ్....**


నివాళులర్పిస్తున్న పోలీసులు

కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :
అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇన్స్పెక్టర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పోలీసులు జాతి సేవకు పునరంకితం కావాలన్నారు. సమాజం కోసం, దేశం కోసం రేపటి తరాల భవిష్యత్తు మంచి కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసుల త్యాగాలను నిత్యం స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశంలోని అంతర్గాత భద్రత చూసుకునే బాద్యత పోలీసులదేనన్నారు. సమాజంలో ఎవరికి ఏ కష్టం, నష్టం వచ్చిన ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులోనూ మొక్కవోని ధైర్యంతో పోలీసులు విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు ప్రజారక్షణ, శాంతి పరిరక్షణ కోసం నిరంతరం ప్రాణత్యాగానికైన సిద్ధంగా ఉండి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## హరిజనవాడ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి


పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్ మున్సిపల్ గాంధీనగర్‌లోని హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు సందర్శించారు. విద్యార్థుల చేత ఉపాధ్యాయులు పలు రకాల స్కూల్ పనులు చేయిస్తున్నారని ఎబివిపి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వాస్తవాలు తెలుసుకునేందుకు వారు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో పిటిఎఫ్, అటెండర్ లేరని, విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేదని ఇక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్యాభోధన చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావును కలిసి వారు కోరారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త ముల్లి జంగయ్యయాదవ్‌ను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు విద్యార్థుల సమస్యలు తీర్చాలని పేర్కొన్నారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు శివకుమార్, నాగేశ్, శ్రీనివాస్, నరేందర్, అంజనేయులు, నర్సింగ్‌రావు, రామోహన్‌లు ఉన్నారు.

## మాయమాటలు చెప్పి డబ్బులు దండుకున్న ఘనుడు

**-న్యాయం కోసం తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు**

**నందిగామ అక్టోబర్21,ప్రభాతవార్త :** అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, మాయమాటలు చెప్పి డబ్బులు దండుకున్న ఓ వ్యక్తి ఉదంతం శుక్రవారం నందిగామ మండలం మజీద్ మామిడి పల్లిలో వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం ..నందిగామ మండలం మజీద్‌మామడి పల్లి గ్రామానికి చెందిన నూర్జహన్, మహ్మద్ రహీమొద్దీన్‌లకు చెందిన ఇళ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయాయి. ప్రభుత్వం వీరద్దరికి ఒక్కొక్కరికి రూ. 95వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసింది. ఇదిలా ఉంటే నిరుపేద బాధితుల అమయకత్వాన్ని ఆసర చేసుకున్న ఆ గ్రామ కావలి కారి కుమారుడు నర్సింలు మాయమాటలు చెప్పి ఇద్దరి బ్యాంకు ఖాతాల నుండి రూ. 1లక్ష 10 వేలు కాజేసినట్లు బాధితులు తహసీల్దారు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్‌ను వివరణ కోరగా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కావలికారు కుమారుడు నర్సింలు చేసిన మోసాల్లో పాత్రదారులు, సూత్రదారులు, ఎవరేవరో తెలియాల్సి ఉంది.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికలల్లో పిఆర్‌టియు ప్రచారం


అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి మద్దతుగా టీచర్లతో ప్రచారం చేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియుటిఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యర్కల రామేశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఓటర్ నమోదులో భాగంగా శుక్రవారం ఘట్‌కేసర్ మండలంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలను పిఆర్‌టియు నాయకులు సందర్శించి ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి సంఘం పక్షాన కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియు అధికారిక అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల పిఆర్‌టియు అధ్యక్షులు రామ్‌నాథ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆనంద్‌రెడ్డి, రాష్ట్రనాయకులు రాఘవులు, జిల్లా నాయకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### జీతం ఇవ్వలేదని వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి

వికారాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
జీతం ఇవ్వలేదని వాటర్ ట్యాంకు ఎక్కి ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వికారాబాద్ మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సిద్దులూరు గ్రామానికి చెందిన యాదయ్య అలియాస్ మీనపల్లి రాజు అనే వ్యక్తి గత 2 సంవత్సరాలుగా శంకర్‌పల్లి మండల పరి ధిలోని ప్రొద్దుటూరు గ్రామ సమీపంలోని ఓ ఫామ్‌హౌజ్ లో పనిచేస్తున్నా డు. గత కొంత కాలంగా వేతనం ఇవ్వకుండా యాజమాని వేదిస్తున్నాడని బాధితుడు ఆరోపించారు. దీంతో మనస్థాపం చెందిన రాజు శుక్రవారం వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలు సుకున్న వికారాబాద్ పోలీసులు, బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని బాధితుడిని సముదాయించి కిందకు దించారు. బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, నాయ కులు ప్యాట శంకర్, పరమేష్, స్థానిక బిజెపి నాయకులు వెళ్లి బాధితుడికి ధైర్యం చెప్పి వికారాబాద్ పోలీస్ స్టేష న్లో ఫామ్‌హౌజ్ యజమానిపై ఫిర్యాదు చేశారు.


వాటర్ ట్యాంకు పై నుంచి కిందకు దింపి సముదాయిస్తున్న బీజేపీ నాయకులు, పోలీసులు

## రాహుల్‌గాంధీ జోడో పాదయాత్రను విజయవంతం చేయాలి

బొంరాస్‌పేట్, అక్టోబర్ 21ప్రభాతవార్త
ఏఐసీసీ మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ జాతీయ నాయకులు ఎంపీ. రాహుల్‌గాంధీ చేపట్టిన జూడో పాదయాత్రను విజయవతం చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్, జయక్రిష్ణ, రాజేష్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకట్‌రాములుగౌడ్ తదితరులు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతు ఈనెల 23న ఉదయం 7గంటలకు ఉమ్మడి పాలమూరు జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణ బ్రిడ్జీ దగ్గర ప్రియతమ నాయకులు రాహుల్‌గాంధీ పాదయాత్ర తెలంగాణా రాష్ట్రంలోకి ప్రవేశిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్రకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు బొంరాస్‌పేట్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు స్వచ్చంధంగా తరలిరావాలని వారు కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అంజిల్‌రెడ్డి, వెంకటరమణగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**-పోలీసు సిబ్బందిని సన్మానించిన మల్లేష్‌యాదవ్**

బొంరాస్‌పేట్, అక్టోబర్ 21ప్రభాతవార్త
పోలీసు అమలరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మల్లేష్ ఎడ్యూకేషన్ సొసైటీ, లాహోటీ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.మల్లేష్‌యాదవ్ అద్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని ఎస్ఐ నయూముద్దీన్‌తో పాటు పోలీసు సిబ్బందికి సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేష్‌యాదవ్ మాట్లాడుతు పోలీసు వ్యవస్థ లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేస్తున్న పోలీసుల సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్‌యాదవ్, పట్లోళ్ళ రాజేష్‌రెడ్డి, న్యూ జనరేషన్ స్కూల్ బాపల్లి పాఠశాల ఉపాధ్యాయులు, లాహోటీ విద్యాసంస్థల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మునుగోడులో కారు విజయం ఖాయం

**బొంరాస్‌పేట్, అక్టోబర్ 21ప్రభాతవార్త :** మునుగోడు ఉపఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇంచార్జ్‌గా ఉన్న ప్రాంతాల్లో కారు దూసుకు పోతున్నదని కోస్గి జడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, టీఆర్ఎస్ యువజన విభాగం వర్కింగ్ ప్రసిడెంట్ మడిగే శ్రీనివాస్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతు మునుగోడులో ఎన్నికలు జరుగడమే ఆలస్యమని ప్రచారంతోనే మునుగోడు ప్రజలు కేసీఆర్‌కు జైకొట్టి కారు గుర్తుకు మద్దతుగా తెరాస అభ్యర్ది కూచుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించడం ఖాయమనే విధంగా పరిస్దితులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వజిద్ మియా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, బియ్యం అందజేత

సిద్దిపేట అర్బన్(చిన్నకోడూరు), అక్టోబర్ 21, ప్రభాతవార్త :
చిన్నకోడూరు మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్రెవెల్లి అజయ్‌కుమార్ గత నాలుగు రోజుల క్రితం కరెంట్ షాక్‌తో మృతి చెందగా శుక్రవారం బాధిత కుటుంబీకులను జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరామర్శించారు. అనంతరం 50 కిలల బియ్యంతో పాటు రూ.4 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జ్యోతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి మంద పాండు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే జీవితంలో నిజమైనా తృప్తి లభిస్తుందన్నారు.

# గ్రామ గ్రామాన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:
పోలీసు అమరవీరుల సేవలు మరవలేనివని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పాపన్నపేటలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులైన హెడ్ కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుల్ ప్రసాద్, రాంచందర్, నర్సింహులు, అబీద్‌హుసేన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శాంతి భద్రతలను కాపాడేందుకు పోరాడిన వీరులని కొనియాడారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గాలయ్య, హెడ్ కానిస్టేబుల్ పూర్య నాయక్, రఘునాథ్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో భారీ ర్యాలీ**

నర్సాపూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, పోలీసులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ ప్రధాన రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ పోలీస్ అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ గంగరాజుతో పాటు నర్సాపూర్ ఎస్ఐ2 శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత వైద్య శిబిరం...**

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 21, ప్రభాతవార్త**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రామాయంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పట్టణంలోని సంజీవని ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంబించారు. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట, చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 60 మందికి పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. పోలీసులతోపాటు అధికారులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, సుభాష్‌గౌడ్, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసులకు సన్మానం...**

టేక్మాల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టేక్మాల్ పోలీసులను ధనూర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. టేక్మాల్ ఎస్ఐ లింగం, సహాయ సిబ్బందిని ధనూర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవయ్య, ఉపాధ్యాయులు వరప్రసాద్, కిరణ్, లత, ప్రభాకర్, శ్రావణ్, రమేష్‌గౌడ్, నస్రత్‌బేగం, వివి శ్రీకాంత్‌లు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సమకూర్చిన నిధిని పోలీసు అమరవీరుల సంక్షేమ నిధికి విరాళంగా అంద జేశారు. విద్యార్థుల్లోనసేవాభవాన్ని పెంపొదించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేస్తున్నట్లు ఉపాధ్యాయులు చెప్పారు.

**విద్యార్థులకు ‘ఓపెన్ హౌజ్’**

వెల్దుర్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త:
మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యార్థులకు ఏఎస్ఐ వసురాం ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధి నిర్వహణ, కేసుల నమోదు, దర్యాప్తుపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో అమరులైన పోలీసులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ ప్రతాప్‌సింగ్ రాథోడ్, పోలీసులు రామచంద్రారెడ్డి, కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి**

కొల్చారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:
విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ఏఎస్ఐలు తారాసింగ్, వాణి అన్నారు. శుక్రవారం కొల్చారంలో పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుండి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ముందుకు సాగుతూ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. దారి పొడవునా విద్యార్థులు పోలీసు అమరవీరులకు నివాళులు అర్పిస్తూ నినిదాలు చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో 2 నిమిషాలు మౌనం పాటించి పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తారాసింగ్, హెడ్ కానిస్టేబుల్ లాయక్ అలీ, దత్తు, మహేష్, సౌందర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, పీఈటీ శ్రీనివారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పాపన్నపేటలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం


నర్సాపూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ దృశ్యం


రామాయంపేటలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి


టేక్మాల్‌లో ఎస్ఐని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


వెల్దుర్తిలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం


కొల్చారంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

## మునుగోడు ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్‌దే విజయం

నర్సాపూర్, అక్టోబర్ 21, **ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిదే విజయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్ గుప్త పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో అక్కడిప్రజలు బిఆర్ఎస్ వైపు ఉన్నారని అన్నారు. మునుగోడులో ఇప్పటివరకు ఎమ్మెల్యేగా కొనసాగిన బిజెపి అభ్యర్థిపై ప్రజల విశ్వాసం లేదన్నారు. దీంతో బిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రబాకర్‌రెడ్డికి ప్రజల పూర్తి మద్దతు ఉందని తెలిపారు. కాగా అక్కడి ప్రచారంలో పాల్గొని ప్రజలనాడీ తెలుసుకున్నామని అన్నారు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మంచి పేరుండటంతో పాటు రాష్ట్రం లో సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమన్నా ధీమానూ వ్యక్తం చేశారు. మునుగోడులో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నా ఆశాబావం పైడి శ్రీధర్‌గుప్త వ్యక్తం చేశారు.

**PUBLIC NOTICE**

The General public hereby informed that pertains to **Smt. NEERUDI PADMA W/o Sri. NEERUDI PADMA RAO** aged about 43 years, Occ: House Wife, R/o. H.No.3-39/1, Athvelly Village, Medchal Mandal, Mechal-Malkajgiri District, Telangana State., has approached the Alwal Branch. Shriram City Union Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days. failing which the loan amount shall be sanctioned to **Smt. NEERUDI PADMA** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the House Bearing No.3-74/4, admeasuring 222.22 Sq.yds. or 185.77 Sq.mts.. in Survey No.288/ , Situated at Athvelly Village and Grampanchayat, Medchal Mandal, the then Ranga Reddy District, present Medchal-Malkajgiri District, Regn. Sub-Dist: Medchal, Regn. Dist: Medchal-Malkajgiri District, Telangana State and bounded by North: 10' Wide Road, South: 8' Wide Road, East: Open Place of Donor (Neerudi Padma Rao), West: Open Place of Neighbours.

**Sd/- P. SRINIVASA RAO**
**Advocate**
Flat No.A-14, Ground Floor, Srinivasa Heights Apts, Adarshnagar, Uppal, Hyderabad-39. Cell: 9346666438

## యాత్ర పొడవునా భారీగా జనం ఉండాలి

-రాహుల్ జోడోయాత్ర జన సమీకరణలో జంగ నర్సింలు



చాకలిధని గుట్టలో జనసమీకరణలో కాంగ్రెస్ నాయకులు

**నందిగామ అక్టోబర్21,ప్రభాతవార్త :** రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా మండల కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. ఈనెల 29,30న మండలంలో సాగనున్న రాహుల్ యాత్రలో భారీగా జన సందోహం ఉండేందుకు షాద్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జీ వీర్లపల్లి శంకర్ సారథ్యంలో ఆ పార్టీ నందిగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగ నర్సింలు ఆధ్వర్యంలో భారీ జన సమీకరణ కోసం సైనికులా పని చేస్తున్నారు. శుక్రవారం నందిగామ మండలం చాకలిధని గుట్ట తండా, రంగాపూర్, సల్వేంద్రి గూడ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి జనం సమీకరణ కోసం గడప గడపకు తిరిగి, జోడో యాత్రకు ఆహ్వానం పలికారు. రాహుల్ జోడో యాత్ర జనసమీకరణకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు జనం నుండి అపూర్వ ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో నందిగామ ఎంపిటిసి కొమ్ము కృష్ణ, మండల ఎస్టీ సేల్ అధ్యక్షుడు శ్రీను నాయక్, డైరెక్టర్ రూప్‌సింగ్, రంగాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల జ్ఞానేశ్వర్, రాధాకృష్ణ, చంధర్, సి. మల్లేష్, గ్రామస్తులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు విద్యార్థులు సహకరించాలి



మేడ్చల్‌లోని పివి పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మేడ్చల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త ః**
మేడ్చల్ మున్సిపాలిటిని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషికి అందరి సహకారం అవసరమని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటిలోని పి వి పాఠశాలలో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. తాము చదువుకుంటున్న పాఠశాల పరిసరాలు, ఇంటి వద్ద ఎలాంటి చెత్త వేయకుండా నడుచుకోవాలని సూచించారు. అదే విదంగా తల్లితండ్రులకు కూడ పరిశుభ్రతపై అవగాహన కల్పించి, ఇంటిలోని వెలువడే చెత్తను తడి, పొడి చెత్తను వేరు వేరుగా చేసి మున్సిలప్ వాహనాలకు అందించే విదంగా వివరించాలన్నారు. నివాసస్థలాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే మున్సిపాలిటి అంత స్వచ్ఛతగా మారుతుందని, విద్యార్థులు కూడ స్వచ్ఛతలో పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

-చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ రావు సూచన



చేవెళ్ల శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో జ్యోతి వెలిగించి ఫ్రేషర్స్ పార్టీని ప్రారంభిస్తున్న చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ రావు

**చేవెళ్ల, అక్టోంబరు 21, ప్రభాతవార్త**
విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే లక్ష్యంతో ముందుకు సాగాలని చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ రావు సూచించారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న సీనియర్ విద్యార్థులకు ఫ్రేషర్స్ పార్టీని నిర్వహించారు. కళాశాల ప్రాంగణలో క్రీడ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ రావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే ప్రణాళిల బద్దంగా నడుచుకోవాలన్నారు. విద్యార్థులు తమ ప్రాంతాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకోవాలన్నారు. తమ ప్రాంతాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి విద్యార్ది చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లి దండ్రులకు మంచి పేరును తీసుకోవాలన్నారు. విద్యార్దులు గురువులను అదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్ది దశ నుండి మంచి ప్రవర్తనను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్‌చారి, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, యాజమాన్యం సభ్యులు శ్రీరామ రఘు, మనోహర్‌రెడ్డి, శ్రీకాంత్, విద్యార్దులు పాల్గొన్నారు.

## దళిత బంధు దేశానికే ఆదర్శం....



కారును అందజేస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

**షాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :**
దళిత బంధు దేశానికే ఆదర్శమని జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిలోని కక్కులూర్ గ్రామానికి చెందిన రమేష్‌కు దళితబంధు పథకం ద్వారా మంజూరైన కారును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో నిరుపేదల అభివృద్ధికి సీఎం కేసీరా ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలు, విద్యార్థులు, మహిళలు అన్ని వర్గాల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని సంక్షేమ పథకాల పేరుతో అందిస్తూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మమతజీవన్‌రెడ్డి, ఎంపీటీసీ కరుణాకర్, నాయకులు రాజేందర్‌రెడ్డి, రాందేవ్, రమేష్, జనార్దన్‌రెడ్డి, యాదగిరి, కృష్ణ, నర్సింలు, బాలు, యాదయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**తలకొండపల్లి అక్టోబర్21,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చుక్కగుట్ట తండాకు చెందిన పాత్లావత్ గోగ్యా నాయక్ మరణించడంతో సర్పంచ్ అలివేలమ్మ ద్వారా విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి పాత్లావత్ చంద్రమ్మకి 5వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు విజయ్ రెడ్డి, వీరన్నపల్లి సర్పంచ్ నాగమణి లింగం గౌడ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, మేక భరత్ రెడ్డి, భాగం మహేష్, మిన్నాల వినయ్, గ్రామ యువకులు కె. సుధాకర్, జి. శివ కుమార్, సతీష్, రమేష్, శ్రీను, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎన్నికలు ప్రచారంలో వివిధ పార్టీల నాయకులు



మునుగోడు శివన్న గూడెంలో బిఎస్పీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎర్రోళ్ల జగన్



మునుగోడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు



ఆడపడుచుకు బొట్టు పెడుతున్న జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి



ప్రచారానికి తరలిన మొయినాబాద్ నాయకులు

**ప్రచారంలో పాల్గొన్న నందిగామ బిఎస్పీ నాయకులు**

**నందిగామ అక్టోబర్21,ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికలు ధర్మానికి ఆ ధర్మానికి మధ్య జరిగే యుద్ధమని నందిగామ బిఎస్పీ పార్టీ మండల ఇంచార్జీ ఎర్రోళ్ల జగన్ స్పష్టం చేశారు. మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో బిఎస్పీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి శంకరాచారికి మద్దతుగా శివ్వన్న గూడెంలో ప్రచారం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలపై వివక్షత చూపుతూ వారికి రాజ్యాంగ ఫలాలు అందకుండా రాజ్యాలు ఎలీన అగ్రవర్ణాలను చిత్తుగా ఓడించాలని ఓటర్ల కాళ్లు మొక్కుతూ ఊరూర ,ఇంటింటికి గడపకు వెళ్లి ఓటర్ల కాళ్లు మొక్కుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు అగ్రవర్ణాలకు తప్పా బహుజనులను చిన్న చూపు చూస్తూ, వివక్షత చూపడం దారుణమన్నారు. ఈ ప్రచారంలో బిఎస్పీ సీనియర్ నాయకులు పొట్ట నర్సింలు, కర్రోళ్ల శివ కుమార్, తదితరులు ఉన్నారు.

**మునుగోడు ప్రచారంలో ఎమ్మెల్సీ**

**తలకొండపల్లి అక్టోబర్21,ప్రభాతవార్త :** మునుగోడులో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపును ఎవరు ఆపలేరని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లి మండలంలోని రేపల్లి గ్రామపంచాయతీలో ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిఎం కెసిఆర్ వేల్ల మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని బిజెపి నాయకులు మాటలు నమ్మి అంధకారంలోకి వెళ్లొద్దని సూచించారు. మునుగోడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ పార్టీ ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

**మునుగోడు ప్రచారంలో బిజెపి నాయకులు**

**షాద్‌నగర్, అక్టోబర్ 21, (ప్రభాతవార్త) :** మునుగోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ తమ ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసింది. శుక్రవారం షాద్‌నగర్ బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మునుగోడులోని గుడాపూర్ గ్రామంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్, కేటీఆర్ ఎన్నిక కుట్రలు చేసిన, ఇంటింటికి వచ్చి ఓట్లు అడుకున్న బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి గెలుపును ఎవరు ఆపలేరని ఆయన పేర్కొన్నారు. అధికార టీఆర్ఎస్ పార్టీ అధికార యంత్రాంగం ఎన్ని ఒత్తిళ్ల పెట్టిన, ఎంత డబ్బు ఖర్చుపెట్టిన బీజేపీ అభ్యర్థి గెలుపును ఆపలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రచారంలో పాల్గొన్న టీఆర్ఎస్ నాయకులు**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న ఎన్నో సంక్షేమ పథకాలతోనే మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గెలుపొందుతుందని కేశంపేట జడ్పీటీసీ, మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే అంజయ్యాయాదవ్ పిలుపు మేరకు మునుగోడు ఉప ఎన్నికల్లో కేటీఆర్ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న గట్టుప్పల్ గ్రామంలో కేశంపేట జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్ అనితరెడ్డితో కలిసి టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిలో ఆడపడుచులకు బొట్టుపెట్టి కేసీఆర్ సంక్షేమ పథకాలను వివరించి టీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**ప్రచారానికి తరలిన కాంగ్రెస్ నాయకులు**

**మొయినాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సి సెల్ ఉపాద్యాక్షుడు శాబాద్ దర్శన్ అన్నారు, శుక్రవారం శాబాద్ దర్శన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రచారం చేయడానికి మొయినాబాద్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, పెద్దఎత్తున తరలివెల్లారు, మునుగోడు నియోజకవర్గంలోని చౌట్‌ఉప్పల్ మండలం అందోల్ గ్రామంలో రోడ్‌షోలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా శాబాద్ దర్శన్ మాట్లాడుతూ మునుగోడు గడ్డ కాంగ్రెస్ అడ్డా అని అన్నారు, , రెవంత్ రెడ్డి ఒంటరి వాడు కాదని తెలంగాణ కాంగ్రెస్ పార్టీకోసం పనిచేసే ప్రతి నాయకుడు రేవంత్ వెంట నడుస్తారన్నారు, గత కోన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నామని, అక్కడి ప్రజలు కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్నారని గుర్తుచేశారు, మునుగోడులో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని దీమా వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మండల అద్యక్షుడు తమ్మలి మానయ్య, శ్రీరాంనగర్ ఎంపీటీసి పట్నం రాంరెడ్డి, ఒబిసి మండల అద్యక్షుడు నారాయణపూరం మహేందర్ ముదిరాజ్, యువజన కాంగ్రెస్ మండల అద్యక్షులు నిరంజన్ గౌడ్, నిర్దుల మహేందర్ రెడ్డి, బాబు, మంగళారం ముధుసుదన్ రెడ్డి, నవీన్, మహేష్, తధితరులు పాల్గోన్నారు,

# భారత్ జోడో యాత్రకు భారీ ఏర్పాట్లు



భారత్ జోడో యాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్ర ఈనెలాఖరులో షాద్‌నగర్, కొత్తూర్ చేరుకోనుండడంతో వీర్లపల్లి శంకర్‌తో పాటు పలువురు ముఖ్యనాయకులు, కార్యకర్తలు కలిసి రాహుల్‌గాంధీకి ఘనంగా స్వాగతం పలకడానికి భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు కొత్తూర్‌లో భారత్ జోడో యాత్రలో పాల్గొనేందుకు భారీ స్థాయిలో వచ్చే ప్రజలు, కార్యకర్తల కోసం వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో బోజనాలు ఏర్పాటు చేయడానికి కొత్తూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి. హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. నందిగామ మండల అధ్యక్షులు నర్సింలు, ఎస్‌బిపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్‌లు పనులను పరిశీలించడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జ్ఞానేశ్వర్, అనంతయ్య, శ్రీశైలం, యాదగిరి, కృష్ణ, తీగాపూర్ ఆంజనేయులు, కృష్ణ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

**భారత్ జోడో యాత్రను విజయవంతం : ఎర్రవరం అంజిరెడ్డి**

**కొందుర్గు, అక్టోబర్ 21, (ప్రభాతవార్త) :** ప్రతి కార్యకర్త అంకిత భావంతో ప్రజలను చైతన్యపర్చి రాహుల్ గాంధీ పాదయాత్రలో అధికంగా భాగస్వాములు అయ్యేలా చూసి భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొందుర్గు శివారులోని చౌరస్తా కహాని రెస్టారెంట్ ఆవరణలో యువజన కాంగ్రెస్ షాద్‌నగర్ నియోజకవర్గం వర్కింగ్ ప్రసిడెంట్ సయ్యద్ ఖదీర్ అధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి జోడో యాత్ర గూర్చి సమీక్షా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జఫర్, ముబారక్, శ్యామ్, గోవర్ధన్‌గౌడ్, నర్సింహ్మా, మహిపాల్‌రెడ్డి, అంజనేయులు, ద్విజెందర్, మహేందర్‌గౌడ్, శ్రీనునాయక్, సురేందర్‌రెడ్డి, ముజ్జూ, సలీ మ్, రవి, హరీష్, సాయిరాం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధిస్తుంది : ముప్పు శ్రీనివాస్ రెడ్డి



**నాగారం అక్టోబర్21,ప్రభాతవార్త :**
మునుగోడు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఘన విజయం సాధిస్తుందని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు నియోజవర్గం ఉప ఎన్నికలలో భాగంగా గట్టుప్పల్ మండల రాగ్యా తండాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్రవంతి గెలుపుకు మద్దతుగా నాగారం పట్టణ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ప్రచారం జోరుగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మీ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వేసి టిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని ఓటరు మహాశయులను కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ పట్టణ పార్టీ అధ్యక్షుడు రామారావు, సోమిరెడ్డి, పొట్ట విఘ్నేష్, రవి, భాస్కర్ నాయుడు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

**తలకొండపల్లి అక్టోబర్21,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో అమరులైన పోలీస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ..విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు అమరులైనారు. పోలీసుల త్యాగ ఫలితమే సమాజంలో ఎలాంటి అలజడులు కుట్రలు లేకుండా కొనసాగేందుకు పోలీసుల పాత్ర అమోఘం అన్నారు. వారి విధి నిర్వహణలో విచ్ఛిన్నకర శక్తుల చేతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, ఏఎస్ఐ నరసింహ, శెట్టి హెడ్ కానిస్టేబుల్ రవి కుమార్, అశోక్ రెడ్డి, తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలపై ఎంపిపి ఆరా



.కాచవాని సింగారంలోని మండల పరిషత్ పాఠశాలను సందర్శించిన ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. మండల పరిషత్ నిధులు నాలుగున్న లక్షల నిధులతో మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 175 మంది విద్యార్థులు గల పాఠశాలకు 125 మంది విద్యార్థులు హాజరుకావడం పట్ల ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడు తరగతులకు నలుగురు టీచర్లు ఉండటం బాధకరమని అన్నారు. ఇలా చేస్తే విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఈ విషయమై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఎంపీపీ వెంబడి గ్రామ సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి, కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## దప్పురాజు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** సర్దానగర్ మార్కెట్ వైస్ చైర్మెన్ దప్పురాజు కుటుంబాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరమార్శించారు, మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన సర్దానగర్ మార్కెట్ కమిటి దప్పురాజు మాతృవియోగం చెందారు, శుక్రవారం ఉదయం 3 గంటల సమయానికి మరణించారు, గత కోంత కాలంగ అనారోగ్యంతో బాదపడుతు శుక్రవారం తుదిశ్వాస విడిచారు, దినితో దప్పురాజు కుటుంబం శోకసంద్రంలో ఉండగా ఈ విషయం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య దృష్టికి రావడంతో శుక్రవారం ఆయన పెద్ద మంగళారం గ్రామంలోని రాజు ఇంటికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహనికి పూల మాలవేసి నివాళ్లు అర్పించి, వారి కుటుంబాన్ని పరమార్శించడం జరిగింది, ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి ఎంపీటీసి బట్టు మల్లేష్, టీఆర్ఎస్ మండల ఉపాద్యాక్షుడు గునుగూర్తి జేవంత్, టీఆర్ఎస్ యువ నాయకులు పరమేష్ పాల్గోన్నారు,

## పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూటీఎస్ సభ్యులు

**శంకర్‌పల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త :**
పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ వివిధ పాఠశాలలను సందర్శించి పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి మొదటి ప్రాధాన్య ఓటుతో గెలిపించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలు సాధించడం సంఘం బాధ్యత, సంఘం అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయుల ప్రమోషన్లూ, బదిలీల కోసం ప్రభుత్వంతో చర్యలు జరుపుతున్నారన్నారు. త్వరలోనే సీపీఎస్, ఈహెచ్‌ఎస్ లాంటి సమస్యలను పీఆర్‌టీయూటీఎస్ సంఘం సాధిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సి. రాములు, గౌరవ అధ్యక్షులు బాలరాజు, షాబాద్ మండల అధ్యక్షులు సుదర్శన్, మొయినాబాద్ మండల అధ్యక్షులు జక్కని బందయ్య, గండిపేట ప్రధాన కార్యదర్శి బీఎన్, షాబాద్ మండల తాజా మాజీ గౌరవ అధ్యక్షులు పురం హరికృష్ణ, మండల బాధ్యులు ఆరిఫ్, మాణిక్యం ఉన్నారు.

## పేదల సంక్షేమం కోసం తనవంతు కృషి



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

**శంకర్‌పల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త :**
పేదల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని శంకర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాత ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జన్మదినం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు దుస్తులు శంకర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాత ప్రవీణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మి సహకారంతో శంకర్‌పల్లి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మెన్ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మెన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు అశోక్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, శంకర్‌పల్లి మున్సిపల్ టీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు పాండురంగారెడ్డి, నాయకులు పార్శి బాలకృష్ణ ఉన్నారు.

## కోతుల బారి నుండి రక్షించాలని యాచారం గ్రామస్తుల వినతి



పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**యాచారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన యాచారం గ్రామంలో కోతుల బారి నుండి తమకు, పిల్లలను రక్షించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో గత మూడు సంవత్సరాల నుండి పెద్ద సంఖ్యలో కోతులు సంచరిస్తున్నాయని, పాఠశాల విద్యార్థులు, మహిళలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయన్నారు. గతంలో తక్కువ సంఖ్యలో ఉన్న కోతుల సంఖ్య ప్రస్తుతం సుమారు 200 వరకు ఉందని, రాత్రి వేళల్లో సైతం కోతులు ఇళ్లల్లోకి చేరి దాడులు చేయడంతో పాటు ఇంట్లోని సామాగ్రిని, ఆహార పదార్థాలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారన్నారు. వెంటనే పాలకవర్గం, అధికారులు స్పందించి గ్రామంలో కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు వెంకటరెడ్డి, యాదయ్య, అంజయ్య, భూషయ్యగౌడ్, సంతోష్ గుప్తా, గణేష్ పాల్గొన్నారు.

## కొత్తపల్లికి బస్సు నడపాలని అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి



ఆర్టీసి అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపసర్పంచ్ జగన్, కంబాలపల్లి విప్లవ్ తదితరులు

**యాచారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త**
మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి ఇబ్రహీంపట్నం ఆర్టీసి డిపో నుండి బస్సును నడపాలని కోరుతూ శనివారం గ్రామ ఉపసర్పంచ్ కావాలి జగన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కంబాలపల్లి విప్లవ్‌లు ఆర్టీసి అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామానికి ఉదయం పూట వచ్చే బస్సు నాలుగు గ్రామాలకు వెళ్లడంతో విద్యార్థులు, ప్రయాణీకులు, రైతులకు సీట్లు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటూ సమయానికి చేరుకోలేకపోతున్నారన్నారు. కొత్తపల్లి గ్రామానికి ఉదయం వచ్చే బస్సు చింతపట్ల, చౌదర్‌పల్లి గ్రామాలకు వెళ్లకుండా యధావిధిగా యధావిధిగా కొత్తపల్లి, తక్కెళ్లపల్లి గ్రామాల నుండి ఇబ్రహీంపట్నం వెళ్లే విధంగా చర్యలు తీసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, కృష్ణ, శివ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

**షాద్‌నగర్, అక్టోబర్ 21, (ప్రభాతవార్త) :** ఫరూక్‌నగర్ మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాత విహెచ్‌పీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ ప్రముఖ్ బండారు రమేష్ శుక్రవారం టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు సదుపాయాలు కల్పించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు టైలు, బెల్టులు ఉండాలనే ముఖ్య ఉద్దేశంతోనే పంపిణీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు ఎం. శంకరయ్య, ఉపాధ్యాయులు ఎ. రాజశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## జుంటుపల్లి గ్రామాన్ని సందర్శించిన బిసి కమిషన్ చైర్మన్ శుభప్రద్ పటేల్

-డయోరియా బాధితులకు ఆర్థిక సహాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న శుభప్రద్ పటేల్

యాలాల అక్టోబరు 21,ప్రభాతవార్త :
అతిసార,డయోరియా విజ్రంభనతో అతలాకుతలమైన యాలాల మండలం జుంటుపల్లి గ్రామాన్ని శుక్రవారం రాష్ట్ర బిసి కమీషన్ చైర్మన్ శుభప్రద్ పటేల్ సందర్శించారు.గ్రామంలో గత పది రోజుల క్రితం నుంచి డయోరియా ప్రభలి సుమారు 75 మంది అస్వస్థకు గురికాగా ఒకరు మృతి చెందారు.మంచినీటి పప్‌లైన్ల లీకేజీలతో మంచినీటి వ్యవస్థ అస్థవ్యస్తంగా మారింది.తద్వార గ్రామంలో అతిసార,డయోరియా వ్యాధి విజ్రంభించిందని తేలిం ది.ఈ క్రమంలో బిసి కమీషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ యువ సేన ఆద్వర్యంలో ట్యాంకుల ద్వారా అక్కంపల్లి,జుంటుపల్లి గ్రామాలకు మంచినీరు మినరల్ వాటర్ పంపిణీ చేపట్టడం జరిగింది.శుక్రవారం జుంటుపల్లిలో పర్యటించిన పటేల్ మృతురా లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అంద జేశారు.అనంతరం ఆస్పత్రి వార్గలతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తిప్పమ్మా,రాజు,గ్రామస్తులు మోహన్‌రెడ్డి, యూ సుఫ్,సంజయ్‌కుమార్,శాంతప్పభా ను,నరేష్,పాల్గొన్నారు.

## పిఆర్‌టియు అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి

-పిఆర్‌టియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్దన్



చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలోని ఉపాద్యాయులను కలిసిన పిఆర్‌టియు రంగారెడ్డి జిల్లా అద్యక్షుడు గోవర్దన్

చేవెళ్ల, అక్టోబరు 21, ప్రభాతవార్త :
పిఆర్‌టియు ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిఆర్‌టియు రంగారెడ్డి జిల్లా అద్యక్షుడు గోవర్దన్ కోరారు. శుక్రవారం చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో పిఆర్‌టియు చేవెళ్ల మండల శాఖ అద్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా పిఆర్‌టి యు రంగారెడ్డి జిల్లా అద్యక్షుడు గోవర్దన్ మాట్లాడుతూ ఉపా ధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పిటిఆర్‌టియు ముం దంజలో ఉంటుందన్నారు.పిటిఆర్‌టియు సంఘం నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తున్న సంఘం పిఆర్‌టి యునే అన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతలు, బదిలీలు ఉంటా యన్నారు. సిపిఎస్, ఇహెచ్‌ఎస్ సమస్యలను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల అద్యక్షుడు సత్తయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి వినోద్,మొయినాబాద్ షాబాద్,గండిపేట్, అద్యక్షుడు బందయ్య, సుదర్శన్, బిఎన్ సుధారాణి, శోభరాణి, ఉపాద్యాయులు కిరణ్, వెంకట్రావ్ తదితరులు పాల్గోన్నారు.

## మునుగోడు ప్రచారంలో పాల్గొన్న అనిత రెడ్డి, తన్వీరాజు ముదిరాజ్



శంషాబాద్ అక్టోబర్21,ప్రభాతవార్త :
నల్గొండ జిల్లాలోని మునుగోడు శాసనసభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితరెడ్డి,శంషాబాద్ జడ్పిటిసి నీరటి తన్వీరాజు ప్రచారం నిర్వహించారు.శుక్రవారం మునుగోడు నియోజకవర్గం లోని గట్టుప్పల్ 11వ.వార్డులో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వ హించారు.ఎన్నికల సమయంలో వచ్చి కల్లవల్లి కబుర్లు చెప్పే వారిని నమోదని టిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని వారు కోరారు. వృద్ధులు వికలాంగులు వ్యాపారులను కలిసి టిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.ఓవైపు అభివృద్ధి కార్య క్రమాలను చేపడుతునూ మరోవైపు సంక్షేమ పథకాల అమలు చేస్తున్న ఘనత కెసిఆర్‌కే దక్కుతుందని అనిత రెడ్డి,నీరటి తన్వి రాజు ముదిరాజ్ ఓటర్లకు వివరించారు.టిఆర్ఎస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని వారన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### -డిఎల్‌పిఓ శంకర్‌నాయక్

పెద్దేముల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:
అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు జవాబుదారిగా ఉండాలని డిఎల్‌పిఓ శంకర్‌నాయక్ అన్నారు.శుక్రవారం పెద్దేము ల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్ వాడి సెంటర్, ప్రకృతివనం, మండల ప్రజాపరిషత్ కార్యాలయం లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించా రు. ఈ సందర్బంగా ప్రకృతి వనాన్ని సందర్శించిన శంకర్‌నా యక్ మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. ఎప్పటికప్పుడు చెత్తచెదారంతో పాటు మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్మీకులకు సూచిం చారు. అంగన్‌వాడి సెంటర్ 3లో రికార్డులను పరిశీలించి సెంట ర్‌కు సరఫరా అవుతున్న సరుకులు, బాలమృతం సక్రమంగా అందుతున్నాయా అని టీచర్ ధనలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నమోదు, పరిసరాల పరిశుభ్రత, పిల్లల సంఖ్యను చూసి ఆయన సంతోషం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ లక్ష్మప్ప, సర్పంచ్ ద్యావరి విజయమ్మ, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్, కారోబార్ నర్సి రెడ్డి తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడి-3లో రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ

# డీఎఫ్‌ఓ కార్యాలయం ముందు హరివిల్లు రిసార్ట్ కార్మికుల ఆందోళన

-ఉపాధి కోల్పోయామంటూ ఆవేదన వెలిబుచ్చిన కార్మికులు



డీఎఫ్ఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న హరివిల్లు రిసార్టు కార్మికులు

వికారాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
అనంతగిరిలోని హరివిల్లు రిసార్టులో పని చేస్తున్న కార్మికులను విధుల నుంచి తొలగించిన విషయం పాఠకులకు విధితమే. తమ ఉపాధి కోల్పోవడానికి కారణం అటవీశాఖ అధికారులేనని భావించి శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి కార్యాల యం ముందు హరివిల్లు రిసార్టు కార్మికులు ఆందోళనకు దిగారు. సీపీఎం నాయ కులు కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మి కులు మాట్లాడుతూ, అటవీశాఖ అధికారులు రిసార్టు ప్రవేశ ద్వారానికి అడ్డంగా కందకం తవ్వడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వెలిబుచ్చారు. దాదాపు వంద మంది కార్మికులు రోడ్డున పడ్డారని, అటవీశాఖ అధికారులే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా అటవీశాఖ అధికారికి వినతిపత్రం సమ ర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహిపాల్, బిక్షపతి, దాసు తదితరులు ఉన్నారు.

**విధి నిర్వహణలో భాగంగానే కందకాలు తవ్వించాం : డీఎఫ్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి**

అటవీశాఖ అధికారులతో కలిసి తాను క్షేత్రస్థాయిలో పరిశీలించానని, విధి నిర్వహ ణలో భాగంగానే కందకాలు తవ్వించడం జరిగిందని డీఎఫ్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలి పారు. హరివిల్లు రిసార్టు కు నక్ష బాట ఉందని, దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హరివిల్లు రిసార్టు మధ్యలో ఉన్న అటవీ ప్రాంతంలోని దారులను, మరికొంత అటవీ భూమిని కబ్జా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే స ర్వే నిర్వహించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# బంగారు మైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవ పూజలు

-పాల్గొన్న భక్తులు..జరిగిన అన్నదాన కార్యక్రమం



అలియాబాద్‌లో బంగారు మైసమ్మ ఆలయ తృతీయవార్షికోత్సవం సందర్భంగ జరిగిన పూజలు, పాల్గొన్న మండల రైతుబంధు అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి దంపతులు,పలువురు భక్తులు



ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగిన దృశ్యం

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త
అలియాబాద్ గ్రామంలోని బంగారు మైసమ్మ ఆలయం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో బంగారు మైసమ్మ ఆలయం వద్ద వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అత్యంత భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు ఘనంగ నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, హోమం, అభిషేకం కార్యక్రమాలు జరిగాయి. తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల పూలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి ఓడిబియ్యం,సారే చీరెలను సమ ర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శామీర్‌పేట మండల రైతుబంధు అధ్యక్షులు కం టం కృష్ణారెడ్డి దంపతులు అమ్మవారికి పట్టుచీర వస్త్రాలు సమర్పించి పూజలో పాల్గొన్నారు. ఆ తరువాత అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆ తరువాత ఈ సందర్భంగ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మండల రైతుబంధు అధ్యక్షులు కంటం కృష్ణారెడ్డితో పాటు గ్రామ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్, ఉపసర్పంచు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్ నరేందర్‌రెడ్డి, వార్డుసభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

-చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో అమరవీరులకు ఘన నివాళులు
-చేవెళ్ల సర్కిల్ ఇన్స్‌క్టర్ వెంకటేశ్వర్లు సూచన



చేవెళ్ళలో కోవ్వోత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న చేవెళ్ళ పోలీసులు

చేవెళ్ల, అక్టోంబరు 21, ప్రభాతవార్త
పోలీసులు సమాజ సేవకు అంకితం కావాలని,విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఒక్క పోలీస్ అమరుల త్యాగాలను స్పూర్తిగా తీసుకోవాలని చేవెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూంచించారు. పోలీస్ అమర వీరుల సంస్కరణ దినోత్సవంను పురస్కరించుకుని శుక్రవారం చేవెళ్ల పోలీస్ సిబ్బంది చేవెళ్ళ మండల కేంద్రంలో కోవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.చేవెళ్ళ పోలీస్ స్టేషన్ మందు జాతీయ రహదా రిపై ర్యాలీని నిర్వహిస్తూ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా చేవెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో నిక్కచ్చిగా విధులు నిర్వహిస్తునది కేవవలం పోలీసులు మాత్రమేనన్నారు. 24 గంటలు ప్రజ ల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న పోలీసులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు దన్నారు. ప్రజల ప్రాణాలకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహించి అమరులైన పోలీసులను అదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రజల మాన,దన, ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లేక్కచేయకుండా విధుల్లో చేరామన్నారు. అన్యాయం జరిగిందంటే ముందుగా పోలీసులు మాత్రమే గుర్తుకు వస్తుంటారన్నారు. ప్రజల గుండెల్లో చిరస్దాయిగా నిలిచిపోవాలంటే పోలీసులు ప్రజలతో సత్సంబందాలు కలిగిఉండాలన్నారు. పోలీ సులపై ప్రజలకు మరింతగా నమ్మకం కల్గే విధంగా విధులు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసులు నిరంతరం పాటుపడాలన్నారు.ప్రజలు సుఖంగా నిద్రపోవాలంటే పోలీసులు సక్రమంగా విధుల నిర్వహించాలన్నారు. అమలరుల మరణం వారి కుటుంబాలకు తీరనిలోటని, చనిపోయిన పోలీసుల కు టుంబాలకు సానుభూతిని కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌లు అబ్దుల్ ఖ య్యుమ్, ప్రదిప్‌కుమార్,కానిస్టేబుల్ నరేష్,రవి గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## శిక్షకుడు శ్రీనివాస్‌రావుకు 'స్ఫూర్తి' సన్మానం

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త: ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థాన సంపాదించిన మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మహిపతి శ్రీనివాస రావును స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. ఘట్‌కేసర్ మండలం వెంకటా పూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో అకాడమిక్ సమన్వయకర్తగా పనిచేస్తున్న సహాయ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఇటీవల ఇంటర్నేషనల్ జీనియస్ బుక్‌ఆఫ్‌రికార్డులో స్థానం పొందగా స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుంటోళ్ల యాదయ్య, ఉపాధ్యక్షులు మేకల పద్మారావులు ఆయనను శాలువాతో సత్కరించి భారత రాజ్యాంగ పుస్తకాన్ని బహుకరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు, యువతకు స్వచ్ఛందంగా మోటివేషన్ తరగతులు నిర్వ హించి వారు మంచి ఫలితాలు సాధించే విధంగా శ్రీనివాస్‌రావు ప్రోత్సహించారని, ఇంగ్లీష్ నైపుణ్యతను పెంపొందించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి శారీరక ఆరోగ్యానికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తారో మానసిక ఆరోగ్యం పట్ల అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

## ఏయూలో ఉత్సాహంగా ప్రీఆర్‌డి శిబిరం



ఏయూలో ప్రీరిపబ్లిక్‌డే ఎంపికల్లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ డైరక్టర్ రామకృష్ణ, ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త మల్లేశ

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ వెస్ట్‌జోన్ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు-2022 కోసం యూనివర్సిటీ స్థాయి ప్రీ-రిపబ్లిక్‌డే పరేడ్ క్యాంపు ఎంపికలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ సంచాలకులు ఎం. రామకృష్ణ, సహయకులు సంజేయ్ బృందం హజరై విద్యార్థుల ఎంపికకు పోటీలను నిర్వహించారు. పరుగుపందెం, పరేడ్, సాంస్కృతిక ప్రతిభలో ఎన్‌ఎస్‌ఎస్ వాలీంటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన వారు నవంబర్ 20 నుంచి 29 వరకు గుజరాత్‌లో జరిగే ప్రీ రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొననున్నారు. ఏయూలోని 4 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లలో 20 మంది వాలీంటర్లు ప్రీఆర్‌డీకి ఎంపిక అయ్యారు. ఈసందర్భంగా ఏయూ వీసీ రామచంద్రం, రిజిస్ట్రార్ సైదాసమీన్‌పాతిమా, సీఈఓ నీలిమలు పాల్గొని వాలీ ంటర్లను అభినందించారు. ఈకార్యక్రమంలో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త చెన్నకేశ్ మల్లేశ, ప్రోగ్రామ్ అధికారులు పి.నవీన్, ఎస్‌కె.నాయబ్ రసూల్, కిరణ్, మధుకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని గేదె మృతి....



రోడ్డుపై మృతి చెందిన గేదె

షాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :
లారీ ఢీకొని గేదె మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని సంకేపల్లిగూడ స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామానికి చెంది న నర్సింలు గేదెలు మేపుతు న్నాడు. రోడ్డు దాటుతున్న గేదెను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు గేదె రూ.80వేలు ఉందని, దీంతో ఉపాధి కోల్పోయానని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలన్నాడు.

## రోడ్డు మరమ్మతు పనులు చేయించిన సర్పంచ్ హాబీబుద్దీన్



రోడ్డు మరమ్మత్తు పనులు చేయిస్తున్న సర్పంచ్ హాబీబుద్దీన్

యాచారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త
మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం నుండి కిషన్‌పల్లి మీదుగా మాల్ మార్కెట్‌కు వెళ్లే మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా ధ్వంసమై నందున అట్టి రోడ్డును శనివారం గ్రామ సర్పంచ్ హాబీబుద్దీన్ గ్రామపం చాయితీ సిబ్బందితో కలిసి మొరం వేయించి రోడ్డు మరమ్మత్తు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న మౌళిక సమస్యల పరిష్కారానికి గ్రామ ప్రజల సహకారంతో కృషి చేస్తున్న ట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు విషయా న్ని తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యపై భర్త హత్యాయత్నం... కేసు నమోదు

తలకొండపల్లి అక్టోబర్21,ప్రభాతవార్త :
నేటి సమాజంలో భార్యభర్తలు ఏడడుగుల బంధంతో కలిసి ఉంటామంటూ ప్రమాణాలు చేస్తూ అంగరంగ వైభవంగా వివాహం జరుపుకుంటున్న కొంత మంది చిన్న చిన్న సంఘటనలతో కుటుంబాలు విచ్చిన్నమైన సంఘటనలు జరుగుతున్నాయి.అందుకు నిదర్శనంగా రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.అందుకు సంబంధించిన పోలీసుల వివరాల ప్రకారం గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన జే.శేఖర్, తలకొండపల్లి మండల జూలపల్లి గ్రామానికి చెందిన హంసకళను గత 14 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది.వీరికి ఇద్దరు కుమారులు సుఖంగా కొనసాగుతున్న కుటుంబంలో గత కొంతకాలంగా కలహాలు మొదలయ్యాయి.భార్య అక్రమ సంబంధం పెట్టుకుందని నేపంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి.ఇటీవల పెద్దల సమక్షంలో రాజీకుదుర్చుకున్న భార్యభర్తలు గత రెండు నెలలుగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు.ఈ నెల 18న మళ్లీ భార్య వద్దకు వచ్చిన భర్త శేఖర్ భార్యను తీసుకెళ్లారు.అనంతరం తన ఇంటి నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం పనులకు తీసుకెళ్లాడు.అక్కడే పొలంలో కొడవలితో ఆమెను హత్య ప్రయత్నం చేసే ప్రయత్నం చేయడంతో ఆమె తలకు చేతికి గాయమైంది.జరిగిన సంఘటనపై శేఖర్ పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

**రౌడీషీటర్ రిమాండ్**

తలకొండపల్లి మండల పరిధిలోని ఫుల్‌సింగ్ తండా గ్రామపంచాయతీకి పరిధిలోని బుడ్డ తండాకు చెందిన సోమ్లా నాయక్ అనే రౌడి షీటర్ ఈనెల 5న దసరా సందర్భంగా తన అన్న కూతురు బంధువులతో కలిసి పండు గకు ఇంటికి వచ్చారు.వారి కార్లను ఇంటి ముందు ఉంచడంతో సోమ్లా నాయక్ టిఎస్ 06ఈఎ6669 ,ఎపి 09 ఈఎఆర్ 2703 నెంబరు గల రెండు కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు.దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం



జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామాల పరిధిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగ డిజబుల్డ్ హోమ్‌లో, మజీద్‌లో జయ ఆఫ్‌గివింగ్‌లో సేవా కార్యక్రమాలను నిర్వహించిన దృశ్యం

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిం చారు. శుక్రవారం మూడుచింతపల్లి మండలంలోని జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామాల పరిధిలో ఉన్న డిజబుల్డ్ హోమ్‌లో, మజీద్‌లో, జయ్ ఆఫ్ గివింగ్ లో పండ్లు పంపిణీ చేసి భోజనంను అందజేశారు. ఎం.రాఘవేందర్‌రెడ్డి, ఐనంపూడి రాజు సునీత దంపతులు హెచ్‌బిఎల్ సహకారంతో సిల్వర్ బ్యాట రీ డివిజన్ ఎంప్లాయిస్ ద్వారా మానసిక వికలాంగులకు భోజనం, పండ్లు పంపిణీ చేశారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ఎం.నాగరాజు గుప్త 50కిలోల బియ్యంను అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గ్రామ సర్పంచు చందుపట్ల విష్ణువర్దన్‌రెడ్డి, శామీర్‌పేట ఎస్ఐ వీరశేఖర్, ఖాన్ నాయకులు నాగరాజుగుప్త, వైవి రమణారెడ్డి, ఎం.లక్ష్మణ్‌కుమార్, కె.కళ్యాణి, జి.కృష్ణారెడ్డి, జింకల నర్సింహ్మా, నరేందర్‌రెడ్డి, రవికాంత్, వార్డుసభ్యులు అనిల్‌రెడ్డి, నాగరాజు, సాయిబాబు,రమేశ్, శివ, మహేశ్, సుధాకర్, రాజు, వీరేష్, కృష్ణ, మహమూద్, అదిల్, మునీర్‌మియ్య, ముజమిల్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామాల్లో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన గ్రామ సర్పంచు సిహెచ్ విష్ణువర్దన్‌రెడ్డి,పాల్గొన్న నాయకులు అనిల్‌రెడ్డి, తదితరులు

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త
జగ్గంగూడ, సంపన్‌బోల్ గ్రామాలకు చెందిన ఇద్దరు అనారోగ్యంతో, ఒకరు ప్రమాదంతో మృతిచెందినట్లు వారి బాధిత కుటుంబాల వారికి ఆర్థిక సహా యంను అందజేసినట్లు జగ్గంగూడ గ్రామ సర్పంచు సిహెచ్ విష్ణువర్దన్‌రెడ్డి తెలిపారు. జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామాలకు చెందిన ఇరుగని బక్కమ్మ, పూజరి కళావతి అనారోగ్యంతో, కోడూరి భూపేందర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు సమాచారం అందుకున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి వారి బాధిత కుటుంబాల వారికి 5వేల రూపాయల చొప్పున మూడు కుటుంబాల వారికి మంత్రి మల్లారెడ్డి ఆర్థిక సహాయం అందించటంతో వేరువేరుగా బాధిత కుటుంబాల వారి ఇళ్లకు వెళ్లి అందజేసినట్లు గ్రామ సర్పంచు విష్ణువర్దన్‌రెడ్డి తెలిపారు. మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామా ల్లో బాధిత కుటుంబాల వారికి ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆయనతో పాటు మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, వార్డుసభ్యులు, నాయకులు, మహేశ్, నాగరాజు, శివ, ఆర్.సాయిబాబు, శివ, సుధాకర్, ఎల్ల శివులు, డి.జంగయ్య,ఇ.నరేశ్, యాదగిరి, పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ భారత్ జోడోను జయప్రదం చేయండి



కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్, అక్టోబరు, 21 (ప్రభాతవార్త)ః
కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ చేపట్టిన బారత్ జోడో యాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి. యూసుఫ్, నందారం ప్రశాంత్, సోమశేఖర్, ఆనంద్‌రెడ్డి, ఆసిఫ్‌ఖాన్, తార్యా నాయక్, శంకర్‌నాయక్, వెంకటప్ప, శేఖర్ తదితరులు అన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 23న మక్తల్ బ్రిడ్జి నుంచి ప్రారంభం అవుతుం దన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.

## ఇళ్ల పరిసరాల్లో చెత్త వేయకూడదు



కొండాపూర్‌లో అవగాహన కలి ్పస్తున్న మున్సిపల్ కమీషనర్

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఇంటి పరిసరాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉండేలా శ్రద్ద వహించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్ పి.వేమనరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సి పల్ 8వ వార్డులోని కొండాపూర్ వార్డు కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛసర్వేక్షన్ 2023లో భాగంగా తడిచెత్త, పొడిచెత్తలపై ప్రజలకు అవగాహ న కల్పించారు. కమీషనర్ విచ్చేసి మాట్లాడుతూ ఆకుపచ్చ చెత్తబుట్టలో, నీలిరంగుబుట్టలో తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త సేకరణ ఆటోలో వేయాలని ఆయన సూచించారు. వార్డుల్లో ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని చెత్తను బయట వేయకూడదని ఆయన సూచించారు. ఈకార్య క్రమంలో స్థానిక కౌన్సిలర్ చిల్కూరి హేమలత, మేనేజర్ మర్రి అంజిరెడ్డి, స్వచ్ఛసర్వేక్షణ్ ఇంచార్జ్ యోగేశ్, వార్డు ఇంచార్జ్ అనిత, ఆర్పీలు పద్మ, రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డికి ఎంఆర్‌పిఎస్ సన్మానం

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి.అశోక్‌రెడ్డిని శుక్రవా రం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు సన్మానించారు. పోలీస్ స్టేషన్‌లో ఎంఆర్‌పిఎస్ నాయకులు సీఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలు వా, పూలదండలతో సత్కరించి కొద్దిసేపు మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు సగ్గు శివకుమార్, రాష్ట్ర నాయకులు ఏనూతల నాగేశ్, ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షులు మొల్గురం నరేందర్, నాయకులు మోత్కుపల్లి శ్రీనివా స్, కప్పరగళ్ల అంజనేయులు, బొడ్డు నర్సింగ్‌రావు, రాంమోహన్‌లు పాల్గొన్నారు.



సీఐ అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు